www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 4 నవంబర్ 2024

ఆర్‌టిసి సేవలు వినియోగించుకోవాలి

డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి

నరసాపురం: ఆర్‌టిసి సేవలను సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం పంచారామ క్షేత్రాలకు బయలుదేరుతున్న బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసం సందర్భంగా పంచారామాలు దర్శించుటకు నరసాపురం డిపో నుంచి పంచారామాలకు రెండు బస్సులు నడపబడుచున్నామన్నారు. ఈ కార్తీకమాసం అంతా ప్రతి ఆదివారం పంచారామాలకు బస్సులు నడుపుచున్నామన్నారు. ఆదివారమే కాకుండా ఏరోజునైనా సరే యాత్రికులకు నరసాపురం డిపో నుంచి బస్సులు నడుపుటకు సిద్ధంగా ఉన్నామన్నారు. నరసాపురం నుంచి బయలుదేరి అమరావతి, అమరావతి నుంచి సామర్లకోట, ద్రాక్షారామం, భీమవరం, పాలకొల్లు, ఐదు పుణ్యక్షేత్రాలు ఒకేరోజు దర్శించుటకు అవకాశాన్ని కల్పిస్తుమన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'బెల్టు' తీస్తారా..!

అనధికారికంగా మద్యం అమ్మకాల జోరు

ప్రతి దుకాణం పరిధిలో మూడు, నాలుగు బెల్టు షాపులు

క్వార్టర్ బాటిల్‌కు రూ.20 అదనంగా అమ్మకం

బెల్టు షాపులను పూర్తిగా కట్టడిచేసేనా అంటూ చర్చ

ఎక్సైజ్ అధికారుల దాడులు నామమాత్రమంటూ విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లో మద్యం ఏరులై పారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్ ద్వారా దక్కించుకున్న ప్రతి దుకాణం పరిధిలోనూ మూడు నుంచి నాలుగు బెల్టుషాపులు కొనసాగుతున్నాయంటూ సర్వత్రా చర్చ కొనసాగుతోంది. బెల్టు షాపులపై ప్రభుత్వం సీరియస్‌గా హెచ్చరికలు జారీచేయడంతో పలు జాగ్రత్తలు తీసుకుని అనధికార మద్యం అమ్మకాలు సాగిస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం టెండర్ల ద్వారా ఏలూరు జిల్లాలో 144, పశ్చిమలో 175 మద్యం దుకాణాలకు అనుమతిచ్చింది. ప్రతి మద్యం దుకాణంలోనూ స్థానిక ఎంఎల్‌ఎలకు 30 శాతం వరకూ వాటాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అక్టోబర్ 16వ తేదీ నుంచి నూతన మద్యం దుకాణాల ఏర్పాటు జరిగింది. దుకాణాలు తెరిచిన వెంటనే బెల్టు షాపుల ఏర్పాటుకు పెద్ద ఎత్తున హడావుడీ జరిగింది. టిడిపి, జనసేన నాయకుల మధ్య బెల్టు షాపుల ఏర్పాటుకు పోటీ కొనసాగింది. బెల్టు షాపుల కోసం ఇరుపార్టీల నాయకులు ప్రత్యేక సమావేశాలు సైతం ఏర్పాటు చేసుకున్న పరిస్థితి. ఉంగుటూరు నియోజకవర్గంలో ఈ వ్యవహారం పెద్ద ఎత్తున సంచలనం సైతం రేపింది. బెల్టుషాపులపై మీడియాలో కథనాలు రావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఎక్సైజ్ అధికారులకు సైతం కచ్చితమైన ఆదేశాలు జారీచేసింది. దీంతో ఒక్కసారిగా మద్యం వ్యాపారులంతా డైలమాలో పడ్డారు. అయినప్పటికీ ఏమాత్రమూ తగ్గలేదు. ప్రతి దుకాణం పరిధిలోనూ రహస్యంగా బెల్టు షాపులు నడిపిస్తున్నారు. బడ్డీకొట్లు, దుకాణాల పరిధిలో బెల్టు అమ్మకాలు సాగిపోతున్నాయి. బెల్టు షాపుల్లో బాటిల్‌కు రూ.20 అదనంగా వేసి విక్రయిస్తున్న పరిస్థితి నెలకొంది. బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నట్లు చెబుతున్నా అవి

చింతలపూడి మండలం రాఘవాపురంలో బెల్టు షాపు

నామమాత్రంగానే ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాలపై ప్రజాప్రతినిధుల పెత్తనం ఉండడంతో ఎక్సైజ్ అధికారులు సైతం ముందుకు అడుగువేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చింతలపూడి మండలం రాఘవాపురంలో బహిరంగంగానే బెల్టు షాపు కొనసాగుతున్నట్లు చెబుతున్నారు. టెండర్ ద్వారా కేటాయించిన మద్యం దుకాణాలు ఏలూరు జిల్లాలో 144 ఉంటే.. ఒక్కో దుకాణం పరిధిలో తక్కువగా లెక్కించినా మూడు బెల్టుషాపులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అధికారిక, అనధికారికంగా 400లకుపైగా మద్యం దుకాణాలు కొనసాగుతున్నట్లు చర్చ సాగుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలో అధికారికంగా 175 ఉంటే అనధికారికంగా బెల్టు షాపుల రూపంలో మరో 350 దుకాణాలు కొనసాగుతున్నట్లు అంచనా వేస్తున్నారు.

కొద్దిరోజుల క్రితం తణుకు మార్కెట్లో బహిరంగంగానే మద్యం అమ్మకాలు సాగించడం జిల్లా ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. ఇలాంటి ఘటనలు జిల్లాలో చాలా చోట్ల కొనసాగుతున్నట్లు చెబుతున్నారు.

విచ్చలవిడి మద్యం అమ్మకాల కట్టడిలో ప్రభుత్వాలు విఫలం

2014-19లో టిడిపి ప్రభుత్వం బెల్టు షాపులపై తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. వైసిపి ప్రభుత్వ హయాంలో నాటుసారా విచ్చలవిడిగా కొనసాగింది. అప్పట్లో కల్తీసారాతో జంగారెడ్డిగూడెం మండలంలో దాదాపు 20 మంది వరకూ చనిపోయిన పరిస్థితి నెలకొంది. విచ్చలవిడిగా సాగుతున్న మద్యం అమ్మకాలను కట్టడిచేయడంలో ఎక్సైజ్ శాఖ పూర్తిగా విఫలమవుతోందని జరిగిన పరిణామాలు తెలియజేస్తున్నాయి. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలతో యువత తప్పుదారి పడుతున్న పరిస్థితి ఏర్పడుతోంది. మద్యం షాపుల్లో ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే అక్రమ మద్యం అమ్మకాలకు చెక్‌పెడుతోంది. ఎంఎల్‌ఎల జోక్యం ఉండడంతో అధికారులు అటువైపు వెళ్లడానికి సంకోచిస్తున్న పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం బెల్టు షాపుల కట్టడిలో ప్రభుత్వం మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

అపోహలు వద్దు.. పారదర్శకంగా రీసర్వే

ఇప్పటికి 174 గ్రామాల్లో రీసర్వే పూర్తి

నేటి నుంచి ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

రైతుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు

ముఖాముఖిలో జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి కె.జాషువా

ప్రజాశక్తి - భీమవరం

రీసర్వేపై అందరికీ చాలా అపోహలు ఉన్నాయి. అవన్నీ అవాస్తవాలు. జిల్లాలో ఇప్పటివరకూ జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న రీసర్వే పారదర్శకంగానే కొనసాగుతోందని, ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి కె.జాషువా తెలిపారు. రైతులు, భూ యజమానుల్లో ఏర్పడిన అపోహలు, సమస్యలు తొలగించేందుకు జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 11 వందల ఫిర్యాదులు స్వీకరించామని, త్వరలో ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో రైతుల వద్ద అక్రమవసూళ్లకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా రీసర్వే, రీసర్వే గ్రామసభల నిర్వహణ, వచ్చిన ఫిర్యాదులు, సమస్యలు పరిష్కారానికి చేపట్టబోయే చర్యలపై ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో జాషువా మాట్లాడారు.

ప్రశ్న : జిల్లాలో రీ సర్వే ఎప్పుడు ప్రారంభమైంది?

జాషువా: గత ప్రభుత్వ హయాంలో 2019లో రీసర్వే ప్రవేశపెట్టగా 2020 డిసెంబర్ నుంచి జిల్లాలో ప్రారంభమైంది.

ప్రశ్న : ఇప్పటివరకూ ఎన్ని గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యింది. ఇంకా ఎన్ని గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉంది?

జాషువా : మొదటి విడతలో 16 గ్రామాలు, రెండో విడతలో 54 గ్రామాలు, మూడో విడతలో 104 గ్రామాల్లో రీసర్వే జరిగింది. ఇప్పటివరకూ 174 గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యింది. ఇంకా 119 గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉంది.

ప్రశ్న : జిల్లాలో ఎంత విస్తీర్ణం ఉంది. ఇప్పటి వరకూ ఎంత విస్తీర్ణంలో రీసర్వే పూర్తి చేశారు?

జాషువా: జిల్లాలో 5,56,521.16 లక్షల ఎకరాల విస్తీర్ణం ఉంది. దీనిలో 2,28,725.74 లక్షల ఎకరాల్లో రీసర్వే పూర్తిచేశాం. సుమారు 3,27,795.42 ఎకరాల్లో పూర్తి చేయాల్సి ఉంది.

ప్రశ్న : ఎప్పటిలోగా రీసర్వే పూర్తి చేయనున్నారు?

జాషువా : జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో 319 గ్రామాలు ఉన్నాయి. మూడు విడతల్లో రీసర్వే పూర్తయ్యింది. నాలుగో విడత గత నెల 14 నుంచి 50 గ్రామాల్లో రీసర్వే ప్రారంభమైంది. వచ్చే ఏడాది 2025 చివర నాటికి జిల్లా వ్యాప్తంగా రీసర్వేను పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.

ప్రశ్న : రీసర్వేలో ఎటువంటి టెక్నాలజీని వినియోగించారు?

జాషువా : రీసర్వే ఎంత సాటిలైట్ కోఆర్డినేషన్ ద్వారానే జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి 70 కిలోమీటర్లకు ఒక పర్మినెంట్ బేస్ పాయింట్ ఏర్పాటు చేశాం. జిల్లాకు సంబంధించి మొగల్తూరు మండలం మొగల్తూరులో, తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో, ఏలూరు జిల్లా పెదవేగిలో బేస్ పాయింట్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మూడు బేస్ పాయింట్లు సాటిలైట్‌కు కనెక్ట్ అవుతాయి. రీసర్వేకు 12 సాటిలైట్లు ఉంటే సామర్థ్యం సరిపోతుంది. అయితే 40 శాటిలైట్లు సామర్థ్యంతో రీసర్వే చేయడం జరిగింది. ఆస్ట్రేలియా వంటి దేశాలు ఉపయోగించిన టెక్నాలజీ కంటే మెరుగైన టెక్నాలజీని రీసర్వేలో వినియోగించాం.

ప్రశ్న : పూర్వం రీసర్వే ఎప్పుడు జరిగింది?

జాషువా : సుమారు వందేళ్ల క్రితం బ్రిటీష్‌వారి కాలంలో రీ సర్వే జరిగింది. అప్పట్లో బ్రిటీష్ ప్రభుత్వం సర్వే బౌండరీ యాక్ట్ 1923 తీసుకొచ్చింది. దీని ప్రకారం ప్రతి 30 ఏళ్లకోసారి సర్వే చేయాల్సి ఉంది. ఎక్కడా అమలు జరగలేదు. తిరిగి 2019 నుంచి రీసర్వే ప్రారంభించడంతో అమల్లోకి వచ్చింది.

ప్రశ్న : రీసర్వే గ్రామసభల ద్వారా ఎన్ని ఫిర్యాదులు స్వీకరించారు?

జాషువా : గత నెల 18వ తేదీ నుంచి రీ సర్వే పూర్తయిన అన్ని గ్రామాల్లో రీసర్వే గ్రామ సభలు నిర్వహించాం. భూ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా సుమారు 11 వందల ఫిర్యాదులు వచ్చాయి. ఈ నెల 4వ తేదీ నుంచి ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ఎల్‌పిఎంలు విడదీయడానికి డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఏ విధమైన చర్యలు తీసుకుంటారు?

జాషువా : ఎల్‌పిఎంలు విడదీయడానికి ఎంతో మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు రుజువైతే ఉపేక్షించేది లేదు. ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటాం. సిసిఎ రూల్స్ ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోం. అవసరమైతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత అధికారులను సస్పెండ్ కూడా చేయడం జరుగుతుంది.

ప్రశ్న : జాయింట్ ఎల్‌పిఎంలు విడదీసుకోవడానికి రైతులు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాల్సి ఉంటుందా?

జాషువా : గతంలో మీసేవా కేంద్రాలు, సచివాలయాల ద్వారా రూ.550 చలానా చెల్లించేవారు. ఈ చలానా విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. మరో రెండు రోజుల్లో అమలవుతుంది. కేవలం యూజర్ ఛార్జీలు చెల్లిస్తే సరిపోతుంది. అంతకుమించి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు.

ప్రశ్న : రీసర్వే పూర్తయిన తర్వాత ప్రభుత్వ భూముల విస్తీర్ణం తగ్గిందనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై మీరేం సమాధానం?

జాషువా : జిల్లాలో రీసర్వే అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగింది. ప్రభుత్వ భూముల విస్తీర్ణం తేడాలు గుర్తించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. భూముల విస్తీర్ణంలో తేడాలు కనుగొనేందుకు మూడు టీమ్‌లను ఏర్పాటు చేశారు. గ్రామస్థాయిలో తహశీల్దార్ టీమ్, డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒ టీమ్, జిల్లాస్థాయిలో జాయింట్ కలెక్టర్ టీమ్‌లు జిల్లాలో పర్యటించనున్నాయి. ప్రభుత్వ భూముల విస్తీర్ణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తేడా కనిపించినట్లు గుర్తిస్తే వాటిని సరిచేసే విధంగా చర్యలు తీసుకుంటారు.

ప్రశ్న : రీసర్వేపై వస్తున్న అపోహలపై మీరేం చెబుతారు?

జాషువా : రీసర్వేపై అపోహలు ఉండడం వాస్తవమే. అయితే రీసర్వే వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. కేవలం కొంతమంది మైండ్‌లో ఒక అభిప్రాయాన్ని ఏర్పాటు చేసుకొని ఆ విధంగా మాట్లాడుతున్నారు. ఆ అపోహలను తొలగించేందుకు కృషి చేస్తున్నాం. రైతుల గట్లు కనీసం ముట్టుకోలేదు. ఎక్కడున్న గట్లు అక్కడే ఉన్నాయి. డ్రోన్ మ్యాప్, రోవర్, రికార్డుల ప్రకారం సర్వే చేశాం. భూమిలో ఏదైనా వ్యత్యాసం ఉంటే దరఖాస్తు చేసుకుని సమస్యను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఎవరూ అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు.

పాలకొల్లులో కార్పొరేట్ స్థాయి కంటి ఆసుపత్రి అభినందనీయం

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో కార్పొరేట్ స్థాయిలో లయన్స్ కంటి ఆసుపత్రి ఉండడం నిజంగా జిల్లా ప్రజల అదృష్టమని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు లయన్స్ కంటి ఆసుపత్రి స్థాపించి 35 సంవత్సరాలైన సందర్భంగా వేడుకల్లో ఆదివారం రూ.3 కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలకొల్లు వాసులు గతంలో కంటి వైద్యం కోసం హైదరాబాద్, వైజాగ్ వంటి ప్రాంతాలకు వెళ్లేవారని ఇప్పుడు ఆ అవసరం లేదన్నారు. కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రిని అభివృద్ధి చేసిన కమిటీని ఆయన అభినందించారు. పలు విభాగాలను లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్లు విజయ కుమార్ రాజు, డాక్టర్ చంద్రశేఖర్ శెట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధికి రూ.లక్ష పైన దానం చేసిన వారిని, ఆసుపత్రి అభివృద్ధికి సహకరించిన వారిని సత్కరించారు. లయన్స్ క్లబ్ 55వ వార్షికోత్సవం కూడా కలిపి నిర్వహించారు. ఇంకా మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ బాబ్జి, ఎన్‌విఎస్ పాపారావు నాయుడు, కెవి.నరసింహం, నందుల సీతా రామారావు పాల్గొన్నారు.

లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆధునిక పరికరాలను ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - తణుకు

పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇరగవరం మండలం రేలంగి గ్రామంలో పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేతా గోపాలన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలపై విద్యుత్ ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.6,014 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేశారన్నారు. 2022 నుంచి వచ్చిన నష్టాన్ని ప్రజలపై వేయడం దారుణమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు కొనుగోలు శక్తి తగ్గి ఆదాయాలు తగ్గి ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరిగిన ధరలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలపై వేసే భారాలు తగ్గించకపోతే రాబోయే కాలంలో సిపిఎం ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్వహిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పివి.ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు జుత్తిగ నరసింహమూర్తి, ఇరగవరం మండల కన్వీనర్ కామన మునిస్వామి, ఇల్లిందరపర్తి సత్యనారాయణ, నీలాపు ఆదినారాయణ, పిల్లి కోటేశ్వరరావు, గుత్తుల రామాంజనేయులు, దంపబోయిన విజయలక్ష్మి, కనకేశ్వరరావు, జోగి సత్యనారాయణ, కొప్పిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

డిసెంబర్ 28, 29 తేదీల్లో భీమవరంలో బాలోత్సవాలు

బాలోత్సవ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ రాజు

ప్రజాశక్తి - భీమవరం

డిసెంబర్ 28, 29 తేదీల్లో భీమవరంలో బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు భీమవరం బాలోత్సవ సంఘం అధ్యక్షులు, రిటైర్డ్ డిఇఒ ఇందుకూరు ప్రసాద్‌రాజు తెలిపారు. స్థానిక గాంధీ భవనంలో భీమవరం బాలోత్సవ సంఘం కమిటీ సమావేశం ఆదివారం చెల్లబోయిన పట్టాభిరామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం బాలోత్సవాల నిర్వహణ విషయంపై చర్చించారు. గతంలో బాలోత్సవాలు నిర్వహించేందుకు ఎంతగానో సహాయ సహకారాలు అందించి అకాల మృతి చెందిన డిఎన్‌ఆర్ కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు సమావేశం సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో బాలల ప్రతిభా పాటవాలు, శక్తియుక్తులు పెరుగుతున్నాయన్నారు. కొత్తరకమైన ఆటలు, సినిమాలు, సాంస్కృతిక రూపాలు సైతం సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్, టివిల ద్వారా పిల్లలకు అందుతున్నాయన్నారు. మరోవైపు ఆటపాటలు, వ్యాయామం తగ్గిపోతున్నాయని తెలిపారు. కుటుంబ బంధాలు, స్నేహభావాలకు, సహాయ దాతృత్వం సడలుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో మంచి వాతావరణం పెరగడానికి సృజనాత్మకతను, అభివృద్ధి చేయడానికి పిల్లల్లో శాస్త్ర సాంకేతికత పరిశోధన పట్ల ఉండే ఆసక్తిని ప్రోత్సహించడానికి విద్యా, సాంస్కృతిక అంశాల్లో ఒకేసారి, ఒకే చోట పోటీల నిర్వహణ కోసం భీమవరంలో 'భీమవరం బాలోత్సవం' పేరుతో పిల్లల పండుగను పెద్దఎత్తున జరుపుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, సాంస్కృతిక రంగ నిష్ణాతులు, తల్లిదండ్రులు విద్యార్థులను ఈ పిల్లల సంబరాల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి పాకలపాటి సీతారామరాజు, సంఘం సభ్యులు జి.రఫాయేలు, జి.ధనుష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంఘం అధ్యక్షులు ప్రసాద్‌రాజు

రాజశేఖర్‌ను మెజార్టీతో గెలిపించాలి

మంత్రి నిమ్మల రామానాయుడు

నరసాపురం : ఎన్‌డిఎ బలపరిచిన పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేరబత్తుల రాజశేఖర్‌ను కలసికట్టుగా పనిచేసి మంచి మెజారిటీతో గెలిపించుకుందామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం స్థానిక బస్ స్టాండు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంటర్ వద్ద గ్రాడ్యుయేట్ ఓటు నమోదు శిబిరాన్ని స్థానిక ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌తో సంయుక్తంగా ఒక అభ్యర్థికి ఓటు నమోదు ఫారమ్ 18ను స్వయంగా మంత్రి రామానాయుడు పూర్తిచేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేరబత్తుల రాజశేఖర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి నాయకురాలు దగ్గుబాటి పురందీశ్వరిదేవి సంయుక్తంగా అభ్యర్థి పేరు ప్రకటించారని తెలిపారు. ఈనెల 6వ తేదీతో నమోదు ప్రక్రియ ముగుస్తుందని, సమయం కేవలం మూడు రోజులు మాత్రమే ఉందన్నారు. గ్రామగ్రామాన, వార్డులను ప్రతి గడపకు వెళ్లి పట్టభద్రులను గుర్తించి, వెనువెంటనే ఓటు నమోదు చేయాలన్నారు. ఎన్నికలకు పునాది అవుతుందన్నారు. రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పులు ఉన్నా, అసలు వడ్డీ కడుతూ సంక్షేమ అభివృద్ధికి ఏ లోటు లేకుండా చూస్తున్న సమర్థుడైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉన్నారని, ఆయనకు తోడుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉన్నారని అన్నారు. పోలవరం, అమరావతి నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, పూర్వ వైభవం తీసుకువచ్చుటకు పనులు వేగవంతం చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో తరలిపోయిన పరిశ్రమలను మరలా రాష్ట్రానికి తీసుకువచ్చి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి రామానాయుడు అన్నారు. ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ఎన్‌డిఎ బలపరిచిన పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేరబత్తుల రాజశేఖర్‌ను కలసికట్టుగా పనిచేసి మంచి మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ఇప్పటికే గ్రామ గ్రామాన, ప్రతి వార్డులకు, ప్రతి గడపకు వెళ్లి పట్టభద్రులను గుర్తించి, ఓటు నమోదు చేయించామన్నారు. ఈ మూడు రోజుల సమయంలో నియోజకవర్గంలో మిగిలిన పట్టభద్రులను గుర్తించి ఓటు నమోదు చేయించి, పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేరబత్తుల రాజశేఖర్‌ను మంచి మెజార్టీతో గెలిపించుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, బిజెపి ఇన్‌ఛార్జి మేకల సతీష్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ చేతి సంచులే వాడాలి

ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ కళ్యాణ్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్లాస్టిక్ మహమ్మారి పర్యావరణ కాలుష్యంతో ప్రజారోగ్యాలు దెబ్బతింటాయని, ప్రతిఒక్కరూ చేతి సంచులనే వాడాలని రైతు బజారు ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ కళ్యాణ్ కుమార్ అన్నారు. ఆదివారం భీమవరం రైతుబజార్‌లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ వస్తువులను వాడ వద్దంటూ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం క్యాన్సర్ లాంటి వ్యాధులు రావడానికి పలు కారణాలున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారాలతో పాటు జరిమానాలు కూడా విధిస్తున్నారని అన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైవిఎల్.మూర్తి, ఆర్.సత్యనారాయణ, రైతులు నాగరాజు, సత్యనారాయణ, రాముడు, ఆళ్ల నారాయణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలని ర్యాలీ నిర్వహిస్తున్న కళ్యాణ్‌కుమార్

కార్మిక ప్రజా ఉద్యమ నేత బ్రహ్మాజీరావు

అంత్యక్రియల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

నరసాపురం : కార్మిక ప్రజా ఉద్యమ నేత కానూరి బ్రహ్మాజీరావు అమరజీవి అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కొనియాడారు. కామ్రేడ్ బ్రహ్మాజీరావు స్వగృహంలో ఆయన మృతదేహానికి సిపిఎం, సిపిఐ నాయకుల బృందం పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రహ్మాజీరావు కుటుంబ సభ్యులకు సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కార్మిక ఉద్యమ నేత కామ్రేడ్ మహమ్మద్ మీరాతో కలిసి అనేక కార్మిక ప్రజా ఉద్యమాలలో బ్రహ్మాజీరావు చురుకైన పాత్రను నిర్వహించారన్నారు. చించినాడ పేదలపక్షాన భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో బ్రహ్మాజీరావు కీలకపాత్ర పోషించిన వ్యక్తి అన్నారు. నిత్యంపేదలు, కార్మికులు పక్షాన నిలబడి పోరాడి అనేక సందర్భాల్లో జైలు జీవితం కూడా గడిపారన్నారు. నిస్వార్థ ప్రజానాయకుడిగా నిత్యం ప్రజల పక్షాన బడుగు జీవుల పక్షాన పనిచేసిన బ్రహ్మాజీరావు అమరజీవిని కొనియాడారు. బ్రహ్మాజీరావు అర్బన్ బ్యాంక్ సొసైటీ డైరెక్టర్‌గా కూడా అనేక పదవులు నిర్వహించారన్నారు. నరసాపురం పార్టీ పట్టణ కార్యదర్శిగా సుదీర్ఘ సేవలు అందించారన్నారు. వారి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటుగా గుర్తు చేశారు. అనంతరం ఆయన పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పార్టీ, కార్యకర్తలు ఎర్రజెండాలతో ఊరేగింపుగా జోహార్లు అర్పిస్తూ పట్టణంలో గాంధీ బొమ్మ, అంబేద్కర్ సెంటర్ మీదుగా మొగల్తూరు రోడ్లో, పార్క్ రోడ్డు మీదుగా ఊరేగిస్తూ హిందూ స్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు కవురు పెదిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, జిల్లా కమిటీ సభ్యురాలు పొగాకు పూర్ణ, పట్టణ కమిటీ సభ్యులు మంచిలి నీలకంఠం, పొగాకు నారాయణరావు, నోముల కొండ, మొగల్తూరు మండల నాయకులు ఎడ్ల చిట్టిబాబు పాల్గొన్నారు.



బ్రహ్మాజీరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

సిపిఎం ఇరగవరం మండల కన్వీనర్‌గా మునిస్వామి

తణుకు : సిపిఎం ఇరగవరం మండల కన్వీనర్‌గా కామన మునిస్వామిని శనివారం రేలంగి గ్రామంలో జరిగిన మండల మహాసభలో నియమించినట్లు జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు. మరో ఐదుగురుని కమిటీ సభ్యులు గాను, దంపబోయిన విజయలక్ష్మి, నీలాపు ఆంజనేయులు, తమరపల్లి మునలయ్య, బొంతు నాగబాబు, జుత్తిగ రామానుజులను మండల కమిటీ సభ్యులుగా నియమించారని కామన మునిస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పార్టీ కృషి చేస్తుందన్నారు. పంట కాలువల్లో వ్యర్థపదార్థాల నివారణకు చర్యలు చేపట్టి, పంట నష్టం జరుగకుండా కృషిచేయాలని, కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని, గోస్తనీలో వ్యర్థాలను తొలగించి, ప్రవహించే నీరు పంటలకు ఉపయోగపడేలా కృషిచేయాలని, జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు, డ్రెయిన్లు, రోడ్లు, వీధిలైట్లు, గ్రామాల్లో వైద్య సౌకర్యాలు ప్రజలకు అందేలాగా, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల వల్ల బాధపడే వాళ్లకు మెరుగైన వైద్యం అందించేలా కృషిచేయాలన్నారు. ప్రభుత్వం అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించే చర్యలు చేపట్టాలని, నవంబర్ 8 నుంచి 14వ తేదీ వరకూ ప్రజా సమస్యలపై ఆందోళన కార్యక్రమాలను గురించి ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించాలన్నారు. 14వ తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాలని, పెంచిన విద్యుత్ ట్రూ ఆప్ ఛార్జీలను రూ.6,072 వేల కోట్ల కరెంటు ఛార్జీలను రద్దు చేయాలని మహాసభ తీర్మానం చేసిందని కామన మునిస్వామి తెలిపారు. రాబోయే కాలంలో ఈ తీర్మానాల అమలకు పార్టీ కృషి చేస్తుందని తెలిపారు.

కళావేదిక నిర్మాణం అభినందనీయం

ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు

భీమవరం టౌన్ : జిల్లాలోనే మొదటి స్థానం కలిగి సుమారు 1100 మంది విద్యార్థులకు ఉపయోగపడే కళావేదిక నిర్మాణం చేయడం చాలా అభినందనీయమని భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు కొనియాడారు. చదువుతోపాటు సాంస్కృతిక కళలు అభివృద్ధి చెందడానికి ఇలాంటి కళావేదికలు ఎంతో ఉపయోగపడతాయని హర్షం వ్యక్తం చేశారు. భీమవరం పట్టణంలో పిఎస్‌ఎం బాలికోన్నత పాఠశాలలో కీర్తిశేషులు చెరుకుపల్లి మురళీకృష్ణ జ్ఞాపకార్థం వారి శ్రీమతి చెరుకుపల్లి కృష్ణవేణి, కుమారుడు సంతోష్ కుమార్ సౌజన్యంతో నిర్మించబడిన కళావేదికను జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావుతో కలిసి ఎంఎల్‌ఎ ఆదివారం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు ఆటపాటలకు అవసరమైన ఈ కళావేదిక నిర్మాణం ఎంతో ఆవశ్యకమని, హెచ్‌ఎం కోరిన వెంటనే దాతగా ముందుకు వచ్చి, అతి తక్కువ సమయంలో ఈ నిర్మాణం చేసి ఇవ్వడం చాలా సంతోషమని ఆయన సంతోష్‌ని అభినందించారు. జనసేన జిల్లా కార్యదర్శి చెన్నమల్ల చంద్రశేఖర్, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి, కెఎంసి మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నదానానికి 78 క్వింటాళ్ల బియ్యం అందజేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కార్తీకమాసం సందర్భంగా భీమవరం పంచారామ క్షేత్రమైన శ్రీసోమేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదాన నిమిత్తం 78 క్వింటాళ్ల ట్రిబుల్ సెవెన్ బస్తాలను ఆలయ ఇఒకు ప్రభుత్వ మాజీ విప్, మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు అందించారు. ముందుగా స్వామివారికి, పార్వతీదేవికి, అన్నపూర్ణ అమ్మవారికి గ్రంధి సునీల్, రవితేజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ప్రతిరోజూ భక్తులు పెద్ద ఎత్తున ఈ పంచారామానికి తరలి వస్తున్న నేపథ్యంలో వారందరికీ కూడా స్వామివారి ప్రసాదాన్ని అందించాలనే సంకల్పంతో బియ్యాన్ని అందిస్తున్నామని మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామకృష్ణంరాజు, ఆలయ ప్రధాన అర్చకులు కందుకూరి సోమనాథ, నల్లం రాంబాబు, నందమూరి ఆంజనేయులు, సమతం తాతాజీ, లీల, తానాల రామకృష్ణ, నల్లంరాజు, మద్దాల సత్యనారాయణ, సభాపతి పాల్గొన్నారు.

నేడు ఆదర్శ వ్యక్తుల అభినందన సభ

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు పాలకొల్లు బస్టాండ్ వద్ద ఉన్న లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో ఆదర్శ వ్యక్తుల అభినందన సభ నిర్వహిస్తున్నట్లు సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు మేడే శ్రీనుబాబు, పోలిశెట్టి శ్రీలీల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెరుగైన సమాజం కోసం కృషి చేస్తున్న ఆయా రంగ వ్యక్తులను అభినందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, విశిష్ట అతిథి, పాలకొల్లు మాజీ ఎంఎల్ఎ డాక్టర్ సిహెచ్.సత్యనారాయణ మూర్తి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చల్లా మల్లికార్జున శర్మ, ఉపాధ్యాయులు బుంగ జెస్సికర, మొగల్తూరు మండలంలో పనిచేస్తున్న దొంగ చింతయ్య, వల్లూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న కంకిపాటి నాగరాజులను అభినందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాభిలాషులు, మేధావులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

6, 7 తేదీల్లో సిపిఎం మండల మహాసభలు

ప్రజాశక్తి - పెనుగొండ

సిపిఎం మండల మహాసభలు ఈనెల 6, 7వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు వడలి గ్రామ శాఖ కార్యదర్శి ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కాంప్లెక్స్ వద్ద సీనియర్ నాయకుడు తొంటా సత్యనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. మహాసభలో పరిశీలకులుగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, కేతా గోపాలన్ పాల్గొంటారని తెలిపారు. మహాసభ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని, పార్టీ అన్ని శాఖల సభ్యులు మహాసభకు హాజరవుతారని అన్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ మహాసభ మండల ప్రజల స్థితిగతులు, అభివృద్ధి, ప్రజల ప్రయోజనాలపై చర్చించి రానున్న మూడు సంవత్సరాలు పార్టీ పనిచేసేలా తీర్మానాలు చేస్తారని తెలిపారు. మహాసభలు జయప్రదం చేసేందుకు గ్రామ ప్రజలు సహాయ సహకారాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు, కొమటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏడుగురికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికీ వైద్యంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు, పైడిపర్రు, వేల్పూరు, రేలంగి ప్రాంతాల్లో పర్యటించి ఏడుగురికి ఉచిత వైద్య సేవలు అందించారు. సంఘ సభ్యులు ఆళ్ల సుబ్రహ్మణ్యం ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'దేవాంగులకు నామినేటెడ్ పదవుల్లో అన్యాయం'

ప్రజాశక్తి - నరసాపురం

ఎపిలో చేనేత జనాభాలో 16 లక్షల మంది ఉన్న దేవాంగ చేనేతలకు నామినేటెడ్ పదవుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని జిల్లా దేవాంగ యూత్ అధ్యక్షులు మావూరి ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం దీనికి సంబంధించి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవాంగ సమాజం పార్టీకి అండగా ఉంటూ వచ్చిందన్నారు. కానీ ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీలో ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. కేవలం ఒకే ఒక్క చేనేత వర్గానికి పదవులు ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ దేవాంగ కార్పొరేషన్, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ సభకు తరలిన ముస్లిములు

ప్రజాశక్తి - నరసాపురం

జమతే ఇస్లాం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ సభకు ఆదివారం నరసాపురం నుంచి భారీగా ముస్లిం సోదరులు తరలివెళ్లారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించి కేంద్రం అమల్లోకి తీసుకొస్తున్న యత్నాలు తక్షణం రద్దు చేయాలని ముస్లిం నేతలు డిమాండ్ చేశారు. అంతకు ముందు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లింలంతా మసీద్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నమాజ్ అనంతరం అంజుమాన్ ఆధ్వర్యంలో పంజాసెంటర్లో ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు షేక్ బాజీ, సయ్యద్ హుస్సేన్, దావూద్ ఖాన్, ఆసిఫ్, గఫర్, మౌలాలీ, ఫెరోజ్, బాబీ, నూరుల్లా పాల్గొన్నారు.

టిడిపిలోకి చినపుల్లేరు సర్పంచి దంపతులు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని చినపుల్లేరు గ్రామ సర్పంచి పెన్మెత్స సావిత్రమ్మ, రామరాజు దంపతులు శనివారం రాత్రి ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు సమక్షంలో టిడిపిలోకి చేరారు. రఘురామకృష్ణరాజు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు పార్టీలకతీతంగా ప్రతి ఒక్క సర్పంచికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటుగా గ్రామాభివృద్ధికి సహకరించడం వల్ల టిడిపిలోకి తాము చేరుతున్నామన్నారు. ఎంఎల్ఎ సహకారంతో తమ గ్రామాభివృద్ధికి కృషిచేస్తామని వారు తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ నిస్వార్థంగా పార్టీకి సేవ చేస్తూ గ్రామాభివృద్ధికి కృషిచేసే వారికి తమ పార్టీలో పెద్దపీట వేస్తామని ఆయన తెలిపారు. సర్పంచి వెంట సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు.

వీరభవాని ఆలయంలో ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలోని ఒకటవ వార్డు ఏటిగట్టు వద్ద ఉన్న వీరభవాని అమ్మవారిని ఆదివారం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ దర్శించుకున్నారు. అమ్మవారికి ఎంఎల్ఎ ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాసం సందర్భంగా అయ్యప్ప స్వాములకు ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి, భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేల్పూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - తణుకు రూరల్

మండలంలోని వేల్పూరు గ్రామంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 2024-25 ఖరీఫ్ సీజన్‌కు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి ఆరిమిల్లి చక్రధర్ రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా లబ్ధి చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు మేలు చేసే ప్రభుత్వం ఇది అని కొనియాడారు. వేల్పూరు గ్రామ సర్పంచి కృష్ణవేణి, మాజీ సర్పంచి పెనుమర్తి సూర్య చంద్రరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వృద్ధురాలిపై అత్యాచారయత్నం

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండలం పాందువ్వ గ్రామానికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన 39 ఏళ్ల కామన్న రమేష్ అనే వ్యక్తి అత్యాచారయత్నం చేశాడు. వివరాల్లోకెళితే.. శనివారం అర్ధరాత్రి ఒంటరిగా ఉన్న సమయంలో దొడ్డదారిన ఆమె ఇంట్లో ప్రవేశించి ఆమె వద్ద నుంచి నాలుగు వేల రూపాయలు లాక్కుని ఆమెపై అత్యాచారానికి ప్రయత్నం చేయటంతో ఆమె ఉండి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

టిడ్కో గృహవాసులకు కొత్త వాహనం ప్రారంభం

రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులోని టిడ్కో గృహవాసులకు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.8 లక్షల వ్యయంతో మరో కొత్త వాహనాన్ని కాలనీవాసులు, మహిళల సమక్షంలో మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కాలనీవాసులు వివిధ పనుల నిమిత్తం గాంధీ బొమ్మ సెంటర్, ఆర్‌టిసి బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే దూరం కావడంతో ఎటువంటి వాహనాలు లేక ముఖ్యంగా మహిళలు నడిచి వెళ్లవలసి వచ్చేదన్నారు. ఒక్కొక్క మనిషి పట్టణ పనులకు వెళ్లాలంటే కనీసం ఆటో ఖర్చు రూ.200 అవుతుందని, నిరుపేదలకు ఆ సొమ్ముతో ఒకరోజు గడుస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గతంలో ఉచిత ప్రయాణ వాహనాన్ని ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని, అప్పటినుంచి కాలనీ ప్రాంతవాసులు ఉదయం నుంచి రాత్రి వరకు ఫుల్ లోడ్‌తో ఉచిత వాహనంలో రాకపోకలు సాగించేవారని అన్నారు. ఆ వాహనం పాతది కావడంతో రిపేర్లు, సమయం కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలతో మరో కొత్త వాహనాన్ని కొనుగోలు చేసి ఆదివారం కాలనీ వాసుల సమక్షంలో ప్రారంభించడం జరిగిందన్నారు. మిగిలిన గృహాలలో కూడా మౌలిక సదుపాయాలు పూర్తిచేసి నూటికి నూరు శాతం లబ్ధిదారులకు తాళాలు ఇచ్చి, గృహప్రవేశాలు చేయిస్తామని మంత్రి నిమ్మల అన్నారు. కాలనీవాసులకు ప్రత్యేకంగా ఉచిత వాహనాన్ని ఏర్పాటు చేసినందుకు మంత్రి రామానాయుడుకు కాలనీవాసులు, మహిళలు కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవి, పెచ్చెట్టి బాబు, బోనం చినబాబు, పొట్నూరి శ్రీనివాసరావు, బందెల భాస్కరరావు, జగ్గరోతు రాంబాబు, మల్లంపల్లి ఫకీరు బాబు, మామిడిశెట్టి పెద్దిరాజు, చిట్టూరి సీతారామాంజనేయులు, కడలి గోపాలరావు, బోనం నాని, అరిమిల్లి రామ శ్రీనివాస్, పీతల శ్రీనివాస్, చినమిల్లి గణపతిరావు పాల్గొన్నారు.

వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ కృషి అభినందనీయం

జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

70 సంవత్సరాలుపైబడిన వారికి కేంద్ర ప్రభుత్వం ఎబి-పిఎంజై పథకం ప్రవేశపెడితే దానిని అమలు చేసేందుకు శివదేవుని చిక్కాల గ్రామానికి చెందిన రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ చేయూత ఇవ్వడం అభినందనీయమని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. మంత్రి కార్యాలయం వద్ద ఆదివారం వృద్ధులకు ట్రస్ట్‌చే దరఖాస్తు నమోదు చేసి, ఐడి కార్డు ఇచ్చే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ట్రస్ట్‌చే గతంలో శివదేవుని చిక్కాల పరిసర గ్రామాల ప్రజలకు తాగునీరు, మహిళలకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడం, కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేయడం అభినందనీయం అన్నారు. గ్రామంలో వైద్యున్ని పెట్టి ఉచితంగా వైద్య పరీక్షలు చేయడమే కాకుండా మందులు ఉచితంగా ఇవ్వడం అభినందనీయం అన్నారు. వచ్చేనెలలో లక్ష రూపాయల ఖర్చుతో మరు భూమిని ఆధునికీకరించి చక్కని పార్కుగా తయారు చేయడం పట్ల వ్యవస్థాపకులు నిమ్మల వెంకట రామారావును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ మద్దాల శ్రీనివాసరావు, ట్రస్ట్ కో ఆర్డినేటర్ శివప్రసాద్, సాధనాల భాస్కరరావు పాల్గొన్నారు.

పట్టణాన్ని అభివృద్ధి చేస్తాం

ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు : తణుకు పట్టణంలో అభివృద్ధి ప్రణాళికలు ఏర్పరుచుకొని తణుకు పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా అభివృద్ధి చేస్తామని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ 15వ ఆర్థికసంఘం నిధులు, మున్సిపాలిటీ నుంచి సాధారణ నిధులు నుంచి దాదాపు 7 పనులకు సంబంధించి రూ.2 కోట్ల 26 లక్షలతో పలు పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ముఖ్యమైన డ్రెయిన్లు, రీడింగ్ రూమ్స్, కమ్యూనిటీ హాలు డెవలప్మెంట్స్, ఎంట్రన్స్ గేటు ఆర్చి వద్ద గ్లినరీ డెవలప్మెంట్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

పిఎంపి అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

ఆచంట : మండలం పిఎంపిడబ్ల్యుఎ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను ఆదివారం ఎన్నుకున్నారు. ఎంపిపిడబ్ల్యుఎ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా కె.నాగరాజు, కార్యదర్శిగా సిద్ధాని శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా యు.రామానుజంను, గౌరవ సలహాదారులుగా కె.నాగేంద్ర, వనం వెంకట సత్యనారాయణతోపాటు మరి కొంతమందిని ఇసి మెంబర్లుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్, వైస్ ఎంపిపి తాళం శ్రీను, ఎంపిటిసి సభ్యులు ఆరుమెల్లి సుబ్బారావు, జిల్లా నాయకులు జోగి వెంకట సత్యనారాయణ, రాష్ట్ర ముఖ్య సలహాదారు గంగాధర్, జిల్లా సెక్రెటరీ శీలం వాసు, జిల్లా ట్రెజరర్‌గా సుబ్బారాయుడు, గుబ్బల పుల్లారావు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ విలువల పరిరక్షణపై సెమినార్

తణుకు : తణుకులోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల నుంచి విశేష స్పందన వచ్చిందని, ఇది రాజ్యాంగ విలువల పరిరక్షణకు ఎంతగానో దోహదం చేస్తుందని ప్రచారవేదిక సమన్వయకర్త డివివిఎస్.వర్మ అన్నారు. ఆదివారం రాజ్యాంగ స్ఫూర్తిని తరగతి గదుల్లో విద్యార్థులకు సులభంగా బోధించే పద్ధతిపై స్థానిక ఎస్‌సిఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాలకు చెందిన కళాశాలలు, హైస్కూల్స్‌కి ప్రాతినిధ్యం వహించే 25 సంస్థల నుంచి 40 మంది అధ్యాపకులు, 15 మంది ఇతర ప్రముఖులు హాజరైయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠిక-పద పరిచయం అంశాన్ని విశ్రాంత ప్రిన్సిపల్ సంకు మనోరమ, ప్రాథమిక హక్కులు అంశాన్ని సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపకులు పేరూరి మురళీకుమార్, ప్రాథమిక విధులు అంశాన్ని శ్రీశ్రీసేవాసమితి కన్వీనర్ పి.దక్షిణామూర్తి, ఆదేశిక సూత్రాలు అంశాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు విష్ణువర్ధన్‌లు వివరించారని, ప్రతీ అంశం బోధనా పద్ధతిపై ప్రతినిధులు పలు సూచనలు చేశారని తెలిపారు. విశ్రాంత ప్రిన్సిపల్ చల్లా హైమావతి, సీనియర్ జర్నలిస్టు బెల్లంకొండ బుచ్చిబాబ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం

ఉండి : గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఎంఎస్ బ్యానర్స్ అధినేత పాటూరి మోహన్ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉండి మండలం పెద్దపుల్లేరు సత్తెమ్మ అమ్మవారి ఆలయ కమిటీ ఛైర్మన్ కలిదిండి కృష్ణంరాజు అన్నారు. ఆదివారం పెద్దపుల్లేరు మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపులో దంత, కేన్సర్, చర్మ, కంటివ్యాధి నిపుణులు పాల్గొని ప్రజలకు వైద్య సదుపాయాలు అందజేశారు. ఈ సందర్భంగా కలిదిండి కృష్ణంరాజు, కలిదిండి పెద్ద అప్పలరాజు మాట్లాడుతూ వేలాది రూపాయల ఖర్చుతో నిర్వహించే వైద్య సేవలను తమ గ్రామ ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చిన పాటూరి మోహన్ అభినందనీయుడని, ఇతరులకు మార్గదర్శకంగా నిలిచాడని అన్నారు. ఎంపిటిసి రాయి రావులమ్మ, కలిదిండి సీతారామరాజు పాల్గొన్నారు.

పర్యాటకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - మొగల్తూరు

బీచ్‌కు వచ్చే పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సూచించారు. మండలంలోని బీచ్‌కు ఆదివారం సాయంత్రం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో, పర్యాటకులతో మాట్లాడారు. కార్తీకమాసం సందర్భంగా పేరుపాలెం, కెపిపాలెం సాగర తీరాలకు వచ్చే పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని అన్నారు. తీరంలో చేస్తున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తీరంలో వర్తకులను, స్థానికులను ఏర్పాట్లుపై ఆరా తీశారు. కార్తీకమాసం నెల రోజుల పాటు పలు జిల్లాల నుంచి లక్షలాది మంది సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నందున ఆమేరకు తీరంలో అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారిణి బి.అరుణశ్రీ, డిఎస్‌పి మురళీకృష్ణ, కెపిపాలెం సౌత్ సర్పంచి అందే వెంకటలక్ష్మీ దొరబాబు, వలవల నాని, బల్ల హనుమంత్, అంటే జగదీష్ మెహర్ బాబా, సత్యనారాయణ ఉన్నారు.

తహశీల్దార్ రాజకిశోర్‌తో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నాయకర్

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదు

తహశీల్దారుకు సూచనలు జారీ చేసిన ఆర్‌డిఒ

మండలంలోని పేరుపాలెం సౌత్, కేపీపాలెం సౌత్ బీచ్‌లో పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు వేగంగా పూర్తిచేయాలని ఆర్‌డిఒ దాసిరాజు సూచించారు. ఆయన ఆదివారం బీచ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తహశీల్దార్ కె.రాజకిషోర్, సిబ్బందికి పలు సూచనలు జారీచేశారు. ఆయనవెంట ఇఒపిఆర్‌డి ఎం.నవీన్ కిరణ్, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు నెలల్లో రూ.59 వేల కోట్ల అప్పు

మాజీ డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఐదునెలల కాలంలో రూ.59 వేల కోట్ల అప్పు తెచ్చారని, దానిలో మీరు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో దేనికైనా వాడారా అని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం వైసిపి క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5 నెలల పాలనలో ప్రజలు తిరస్కరించే స్థితికి కూటమి ప్రభుత్వం వచ్చిందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయం గురించి మాట్లాడుతుంటే దానికి స్థానిక ఎంఎల్ఎ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. తాడేపల్లిగూడెంలో లా అండ్ ఆర్డర్ గురించి పట్టించుకున్నరా, మీ ప్రభుత్వం వచ్చిన 4 నెలల కాలంలో తాడేపల్లిగూడెం పట్టణంలో 4 మర్డర్లు జరిగాయన్నారు. బెల్టు షాపుల గురించి మీ ఎల్లో మీడియాలోనే రాస్తున్నారన్నారు. మాట్లాడేముందు సబ్జెక్ట్ తెలుసుకుని మాట్లాడాలన్నారు. రోడ్లు, గుంతలు గురించి మాట్లాడుతున్నారు, 2014 నుంచి 2019 మధ్య ఐదేళ్లలో ఎన్ని రోడ్లు వేశారని ప్రశ్నించారు. గడిచిన తమ వైసిపి ప్రభుత్వంలో నవాబ్‌పాలెం నుంచి నిడదవోలు, చిలకంపాడు లాకుల నుంచి వెంకట్రామన్నగూడెం వరకు రూ.45 కోట్ల నిధులతో 4 లైన్స్ రోడ్లు వేసామని గుర్తు చేశారు. గోతులు పూడిపించానని చెప్పడం మానేసి రోడ్ల నిర్మాణానికి ఎంత సాంక్షన్ చేశారో ప్రజలకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి సంపత్ కుమార్, గుండెబోగుల సాంబయ్య, బండారు నాగు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పలుచోట్ల కార్తీక వన సమారాధనలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 12వ వార్డు పార్క్ రోడ్డులో చౌడేశ్వరి దేవి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు బొమ్మిడి నాయకర్, మాధవ నాయుడు, ఆర్‌డిఒ దాసిరాజును సన్మానించారు.

భీమవరం టౌన్ : కార్తీకమాసంలో నిర్వహించే కార్తీక వన సమారాధన కార్యక్రమాలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సరిపిడకల రామారావు, వేంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి వెంకటరాజు, కుక్కల బాల, జనపాటి మధుసూధన్ రావు అన్నారు. ఆదివారం భీమవరం మార్కెట్ యార్డు సమీపంలోని ఎస్టేట్‌లో భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ ఫ్రెండ్స్ వారి కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కార్తీక దామోదర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. పెన్నాడ శ్రీను, అల్లం రమేష్ దంపతులు, కృష్ణారావు, చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

ఆచంట : బిసి కులస్తులు ఆర్థికంగానూ, రాజకీయపరంగ మరింత బలోపేతం కావాలని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ సూచించారు. ఆదివారం ఆచంట ఎఎంసి కార్యాలయం ఆవరణలో జరిగిన శెట్టిబలిజ వర్తక సంఘం కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్తక కమిటీ సభ్యులు ఆయనకు, పలువురు కుల పెద్దలకు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ బిసిలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తానని అన్నారు. బిసిలంతా ఐక్యమత్యంతో కలిసిమెలిసి వ్యాపార, ఉద్యోగ, రాజకీయపరంగా మరింత ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక, ప్రమాణ స్వీకారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వర్తక కుటుంబ సభ్యులు, సంఘీయులు తరలి వచ్చారు.

సహకార రంగంలో బ్యాంకు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజలే భాగస్వామిగా సహకార రంగంలో బ్యాంకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. దిజాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 12వ బ్రాంచ్‌ను ఆదివారం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు(బాబ్జి) జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలే భాగస్వామ్యులుగా సహకార రంగంలో బ్యాంకులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. మరో ఏడాదిలో 100వ సంవత్సరంలోకి అడుగు పెడుతూ అడుగుపెడుతూ 12వ బ్రాంచిగా తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేయడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. ఈ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ సహకార బ్యాంకింగ్ రంగంలో దిజాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవి అన్నారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ బ్యాంకు ద్వారా విశిష్టమైన సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దిజాంపేట కోఆపరేటివ్ బ్యాంక్ సిఇఒ ఎం.విజయ్ ప్రతాప్, డిప్యూటీ సిఇఒ ఎస్.భరణి కుమార్, బ్యాంక్ డైరెక్టర్లు, వివిధ బ్రాంచీల ఛైర్మన్లు పాల్గొన్నారు.

'కార్యకర్తలే టిడిపికి పట్టుకొమ్మలు'

తాడేపల్లిగూడెం: టిడిపికి కార్యకర్తలే పట్టుకొమ్మలని, వారు అహర్నిశలు కష్టపడితేనే ఈరోజు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తాడేపల్లిగూడెం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 12వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి దాట్ల జగన్నాధరాజు ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాబ్జి మాట్లాడుతూ కార్యకర్తలకు ఎలాంటి ప్రమాదం వచ్చినా పార్టీ వారికి అండగా నిలబడాలని సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు కార్యకర్తలకు ఇన్సూరెన్స్ ఇచ్చి, వారికి భరోసాగా పార్టీ నిలుస్తుందని తెలిపారు. గతంలో రెండు లక్షలు ఉన్న ప్రమాద బీమాను ఇప్పుడు రూ.5 లక్షల వరకూ పెంచారని ఆయన తెలిపారు. కుటుంబంలో యజమాని ప్రమాదకరంగా చనిపోతే వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా ఇచ్చి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఇన్సూరెన్స్‌పై ప్రతిపక్ష పార్టీలు సోషల్ మీడియాలో పలు అసభ్యకరంగా పోస్ట్ చేస్తున్నారని, దాంతో నాయకులకు కొంత ఆవేదన కలిగిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోలో తెలిపిన అంశాలన్నీ ఒకదాని తరువాత ఒకటి అమలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని బాబ్జి తెలిపారు. వార్డు ఇన్‌ఛార్జి దాట్ల జగన్నాథరాజు, టిడిపి టౌన్ ప్రెసిడెంట్ పట్నాల రాంపండు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసాపురం : కార్యకర్తలు, ప్రజల సంక్షేమమే కూటమి లక్ష్యమని టిడిపి మండల ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని 14వ వార్డులో సభ్యత్వాలను ఆయన అందించారు. అనంతరం పొత్తూరి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5 వేలకుపైగా సభ్యత్వాలను నమోదు చేయించామన్నారు. 40 వేల టార్గెట్‌ను త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఇటు ప్రజలు, కార్యకర్తలు సభ్యత్వాలను తీసుకునేందుకు అసక్తి చూపుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ సభ్యత్వం తీసుకుంటే ప్రభుత్వం రూ.5 లక్షల బీమాతో పాటు పలు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. కావున ప్రతిఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జక్కం శ్రీమన్నారాయణ, వాతాడి ఉమా, కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవి, కోరాడా పాపారావు, మౌలాలీ, రామకృష్ణ, షాజహాన్లు పాల్గొన్నారు.

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

కార్తీకమాసంలో మొదటి ఆదివారం కావడంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయం చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. వడ్డునున్న ఆలయాలను దర్శించుకుని, సరివి కొబ్బరి తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, నీలాద్రిపురం గ్రామమునకు చెందిన కంచర్ల లక్ష్మీనారాయణ S/o.వెంకట రామారావు అను నాకు పాస్ పోర్టు నెం.**R9328983** పాస్ పోర్టు కలదు. నేను మోటార్ సైకిల్ పై నా పాస్ పోర్టు తీసుకుని చినతిరుపతి నుండి మా ఇంటికి నీలాద్రిపురం ది.**20-10-2024**వ తేదీన వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినది. నా పాస్ పోర్టు దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు ఫోన్ నెంబర్‌కు తెలియజేసి అందజేయగలరు.

అడ్రస్: **కంచర్ల లక్ష్మీనారాయణ,**
S/o.వెంకట రామారావు, డోర్ నెం 1-147,
కొత్తపేట నీలాద్రిపురం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమగోదావరి జిల్లా. సెల్ :9642566122

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 13/2024

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్
-వాది

మరియు

D-1) తొంటా పెద్దింట్లు అండ్ అనదర్
-ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: తొంటా పెద్దింట్లు, W/o. ప్రభాకరరావు, డోర్ నెం. 3-115, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: వేముల శ్రీనివాస్, S/o. భాస్కరరావు, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 08-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన్న విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 59/2020

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్
-వాది

మరియు

D-1) వేముల వర్ధనరావు మరియు యితరులు
-ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: వేముల వర్ధనరావు, S/o. చిరంజీవి, డోర్ నెం. 4-105, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 12-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన్న విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 181/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్
-వాది

మరియు

D-1) పజ్జూరి మోహనరాణి మరియు యితరులు
-ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: పజ్జూరి మోహనరాణి, W/o. రమేష్, డోర్ నెం. 3-115, 4వ బ్లాకు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: పజ్జూరి రమేష్, S/o. మల్లేశ్వరరావు, డోర్ నెం. 3-115, 4వ బ్లాకు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 05-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన్న విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 229/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్
-వాది

మరియు

D-1) తొంటా శ్రీనివాసరావు మరియు యితరులు
-ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: తొంటా శ్రీనివాసరావు, S/o. రామారావు, డోర్ నెం. 25-11-14/1, రామయ్యహోలు వీధి 14వ బ్లాకు, శంబునిపేట, పాలకొల్లు.

D-2: తొంటా జ్యోతిలక్ష్మి, W/o. శ్రీనివాసరావు, డోర్ నెం. 25-11-14/1, రామయ్యహోలు వీధి, 14వ బ్లాకు, శంబునిపేట, పాలకొల్లు.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 12-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన్న విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514